నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి: కౌసర్


ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఆయన కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయం దారుస్సలంలో ఎంపీని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పంపిన ప్రతిపాదనలు తదితర విషయాలను ఆయన ఎంపీకి వివరించారు. గోల్కొండలోని బీజేఆర్ బాలిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధి, అదనపు తరగతుల నిర్మాణం, కళాశాల ప్రాంగణ సుందరీకరణపై తాను విద్యాశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అదే విధంగా కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో పర్యటించాలని ఎమ్మెల్యే అసదుద్దీన్ ఒవైసీని కోరారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమే ఉన్నదన్న విషయం ప్రజలందరికీ తెలపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. త్వరలోనే తాను కార్వాన్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తానన్నారు.

బోనాల జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు

చార్మినార్: పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసినట్లు భాగ్యనగర్ బోనాల జాతర ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఇందులో భాగంగా బంగారు బోనం పూజలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు కౌడి మహేందర్, సుమన్ కుమార్, ప్యారసాని వెంకటేష్ తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21న పాతబస్తీలో అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు, 28న బోనాల సమర్పణ, 29న ఘటం పరిసమాప్తి సామూహిక ఊరేగింపు ఉంటుందన్నారు.



భక్తిశ్రద్ధలతో రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో గురువారం ఉదయం రుద్ర సహిత త్రి శత చండీ మహాయాగం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధి గాజుల కృష్ణ, పద్మ దంపతులు మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన రుద్ర సహిత త్రిశతచండీ మహాయాగం పూజా కార్యక్రమాలు 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 20 రోజుల పాటు దీక్షా పూర్వకంగా వేద పండితులతో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మైత్రి కమిటీ సభ్యుల సేవలు అమోఘం


మైత్రి కమిటీ సభ్యుల సమావేశంలో రాజువస్తాద్ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సేవలు అమోఘమని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ అన్నారు. గురువారం గోల్కొండలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలు కాపాడడంలో పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు అండగా ఉంటూ స్థానికంగా మతసామరస్యం కాపాడడానికి తమవంతు సహకారం అందిస్తున్నారన్నారు. బోనాల ఉత్సవాలు, వినాయక ఉత్సవాలు, మొహర్రం ఊరేగింపులు తదితర సమయాలలో హిందూ ముస్లింలతో కలిసి ఉన్న మైత్రి కమిటీలు పోలీసులకు సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు హబీబ్, కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ, అశోక్‌కుమార్, ఇలియాస్ అలీ, జంగయ్య తదితరులున్నారు.

సన్మానం


నూతి శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నూతి శ్రీకాంత్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌గుప్తా ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మమతా గుప్తా, సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేద బడుగు వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు.

నర్సింగ్‌రావుకు అభినందనలు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏడాది ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీకి తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్న లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నర్సింగ్‌రావును పలువురు అభినందించారు. ఢిల్లీలో జరిగిన లాల్‌దర్వాజ బోనాల జాతర ఉత్సవల సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ శాలువా కప్పి ఘనంగా సత్కరించి మెమొంటో అందజేశారు. ఢిల్లీ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ లలిత, లాల్‌దర్వాజ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మానిక్ ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మెమొంటో అందుకుంటున్న తిరుపతి నర్సింగ్‌రావు

ఉత్తర భారతీయులకు కార్పొరేషన్ పదవులు ఇవ్వండి



అబిడ్స్: ఉత్తర భారతీయులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. దాదాపు 20 లక్షలకు పైగా ఉన్న ఉత్తర భారతీయులకు చైర్మన్ పదవి అప్పగిస్తే ఉత్తర భారతీయుల సంక్షేమానికి దోహద పడుతుందన్నారు. కాంగ్రెస్ ఎంపీ కురణీయన్‌కు ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..హైదరాబాద్, పార్లమెంట్ నియోజకవర్గంలో లక్షలాది మంది ఉత్తర భారతీయులు ఉన్నారన్నారు. 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతూ ఉత్తర భారతీయుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ఎంతో కృషి చేశానన్నారు. చైర్మన్ పదవి కేటాయించాలని నిర్మల్‌కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

బోనాల ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ బోనాల జాతర ఉత్సవాల బ్రోచర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సాకెళ్లి సర్వేశ్ కుమార్, అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ..ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను ఈసారి ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జి.కృష్ణ, మధుచారి, ప్రధాన కార్యదర్శి ఎస్.వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీలు పి.సతీష్ (చిన్న), కె.నర్సింహ రాజ్, కార్య నిర్వాహక కార్యదర్శి ఎం.శివ కుమార్, సోనూ, డి.నవీన్ కుమార్, కోశాధికారి డి.మనీష్, కార్యవర్గ సభ్యులు నరేశ్, నిఖిల్, బాల్‌రాజ్, సన్నీ, మనోజ్, శ్రావణ్, నర్సింగ్, సాయి, కృష్ణ యాదవ్, అభిషేక్, కిశోర్, ప్రధాన అర్చకులు విష్ణుచారి పాల్గొన్నారు.

ఆషాఢం.. అమ్మకు ప్రీతి పాత్రం

- అమ్మవార్లకు ఆషాఢంలో బోనం సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం
- శాస్త్రీయతల కలబోతగా బోనాల ఉత్సవాలు
- ఆషాఢ మాస బోనాల ప్రారంభం సందర్భంగా ప్రత్యేక కథనం


అమ్మవారికి బోనాలను సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు (ఫైల్)


లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం


అమ్మవారు

చాంద్రాయణగుట్ట: అమ్మల గన్న అమ్మ.. మహంకాళమ్మకు ఆషాఢ మాసం ఎంతో ప్రీతి పాత్రమైంది. ప్రతి ఇంటి నుంచి ఆడ పడుచులు పసుపు, కుంకుమతో అలంకరించిన పాత్రలో అగ్ని సాక్షిగా నైవేద్యం(బోనం) సమర్పించడం అమ్మవారికి ఎంతో సంబురాన్ని కలిగిస్తోంది. గ్రామ పొలిమేరలలో ఉండే అమ్మవార్లకు ఈ మాసం మొత్తం భక్తులు బోనం సమర్పించడం అనాధిగా వస్తుంది. ఆది పరాశక్తిని మాఘ, చైత్ర, అశ్వయుజ, ఆషాఢ మాసాలలో పూజించాలని పురాణాలలో ఉంది. అందులో భాగంగానే తెలంగాణ ప్రాంతంలో సమస్త జగత్తుకూ మూలాధారమైన అమ్మవారిని బోనాల పేరుతో వైభవంగా పూజిస్తారు.

సంప్రదాయం.. శాస్త్రీయతల కలబోత బోనాలు..

విస్తారంగా కురిసే వర్షాలతో ఈ మాసంలో కలరా, మలేరియా లాంటి అంటువ్యాధులు చాలా త్వరగా వ్యాపిస్తుంటాయి. ఈ సీజన్‌లో వచ్చే ఈ అంటువ్యాధులు మనుషులపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. సాధారణంగా ఈ అంటు వ్యాధులు క్రిమీకీటకాలతో పాటు జంతువుల నుంచి సోకుతుంటాయి. అంటువ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు రాకుండా చూడాలని అమ్మవార్లను వేడుకొని భక్తులు బోనాలు సమర్పిస్తారు. ఈ బోనాల పండుగలో ఆచారం, సంప్రదాయంతో పాటు శాస్త్రీయ కారణాలు కూడా ఉండడం మరో విశేషం. బోనాల సందర్భంగా మహిళలు కాళ్లకు రాసుకునే పసుపుతో వానాకాలంలో అరికాళ్లు చెడకుండా ఉంటాయి. దీంతో పాటు ఈ పండుగకు అలంకారంగా ప్రతి ఇంటి గుమ్మాలకు, వీధి వీధికి వేపాకు మండలు కడుతారు. ఆ వేపాకులో ఉండే గుణం ద్వారా క్రిమీ కీటకాలు నాశనం అవడంతో పాటు అంటు వ్యాధులు కూడా దరిచేరవు.

మానవ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా బోనం అలంకరణ..

బోనం అలంకరణతో కూడా మానవ జీవన విధానాన్ని పోల్చుతారు. బోనాన్ని మూడు అంతస్తులుగా పేరుస్తారు. మొదటగా కుండలో ఉడకబెట్టిన అన్నం, బెల్లం, పెరుగు, వేపాకులు పెట్టి.. దానిపైన పులుసు (సాకనీరు).. దానిపైన వేపాకులు పెట్టి దీపం ఏర్పాటు చేస్తారు. కాగా బోనాన్ని మానవ శరీరంగా, అన్నాన్ని ఆత్మ నైవేద్య ప్రసాదంగా, బొట్లు మనిషికి ఉండే అలంకరణగా, మధ్యలో ఏర్పాటు చేసే వేపాకులు మనిషి జీవితంలోని అనుభవాలకు ప్రతిరూపంగా కూడా భావిస్తారు.

అక్కలకు రక్షణగా తమ్ముడు పోతరాజు..

గ్రామ పొలిమేరలలో ఉండే మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, డొక్కాలమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ తదితర అక్కా చెల్లెళ్లను అంటుకునే తమ్ముడు పోతరాజు ఉంటాడు. అమ్మవారికి నైవేద్యం అర్పించేటప్పుడు దుష్ట శక్తులు రాకుండా పోతరాజు చేతిలో ఉన్న కొరడాతో తరముతూ మాతకు బోనం సమర్పించే వరకు రక్షకుడిగా ఉంటారు. ఈ తంతు ఎంతో పవిత్రంగా కొనసాగుతుంది. బోనాల రోజున స్త్రీలు తలస్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, బోనం తయారు చేసి తలపై పెట్టుకొని వెళ్లి సమర్పిస్తారు. శక్తి స్వరూపిణైన మహంకాళికి భక్తిశ్రద్ధలతో భోజనాన్ని తాము మొక్కుకున్న రీతిలో సమర్పించుకోవడాన్నే బోనాలు అంటారు.

భాగ్యనగరంలో శతాబ్దాలుగా బోనాల సంబురం..

భిన్న సంస్కృతుల మేళవింపుగా నిలిచిన భాగ్యనగరంలో బోనాల వేడుక శతాబ్దాలుగా ఘనంగా కొనసాగుతూ వస్తుంది. అమ్మవారిని ప్రసన్నం చేసుకునేందుకు నిర్వహించే ఈ ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల్లో ఎన్నో విశిష్టతలు నెలకొని ఉన్నాయి. ఒక్కో ఘట్టంలో ఒక్కో విశ్వాసం ఉంటుంది. డప్పుల దరువులు, తప్పెట మోతలు, పోతరాజుల విన్యాసాలు, పలహారపు బండ్ల ఊరేగింపు, బంధువుల సందడి, బోనాల అలంకరణ, ఆడపడుచుల ఆనందం, సంప్రదాయ వస్త్రాధారణ, పోతరాజుల వీరంగాలు, శివసత్తుల చిందులు, యువకుల కోలాహాలం.. ఇలా ఈ పండుగకు ఉన్న ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్తిరాజ్


నియామకపత్రం అందుకుంటున్న సత్తిరాజ్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలియమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా షేక్‌పేట్‌కు చెందిన ఏ.సత్తిరాజ్‌కు ఆయన గురువారం తన కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు.

అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శివచంద్రగిరి

గౌలిపురా: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం గౌలిపురాలో యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.శివచంద్రగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివ చంద్రగిరి మాట్లాడుతూ..బండి సంజయ్ ఆయురారోగ్యాలతో ఉండాలని.. ప్రజల ప్రేమ ఎల్లవేళలా తనపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆదర్శ మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, బీజేపీ నాయకులు వెంకటేశ్, ధీరజ్‌లాల్, మధుసూదన్ గిరి, భానుప్రకాశ్, జె.అశోక్, యువ మోర్చా నాయకులు జగన్ మోహన్, వెంకట్, దయాకర్, మహిళా మోర్చా నాయకులు అనిత పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తికి జైలు

నాంపల్లి: బోనాల వేడుకల్లో మద్యాన్ని సేవించి ఓ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తికి 11వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష, ఐదువేల జరిమానా విధించారు. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈనెల 7న నాంపల్లి క్రిమినల్ కోర్టులో బోనాల వేడుకలు జరిగాయి. ఆసిఫ్‌నగర్‌కు చెందిన యాదిగిరి కుమారుడు ప్రవీణ్(48), అలాగే విజయనగర్ కాలనీకి చెందిన ప్రైవేట్ డ్రైవర్ వాసు బోనాలకు హాజరయ్యారు. మద్యాన్ని సేవించి ఉన్న ప్రవీణ్ అక్కడే ఉన్న డ్రైవర్ వాసుతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన ప్రవీణ్, డ్రైవర్ వాసుపై దాడి చేశారు. ఈ దాడిలో వాసు తలకు బలమైన గాయాలు అయ్యాయి. దీంతో బాధితులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే దాడికి పాల్పడిన ప్రవీణ్‌ను పోలీసులు అరెస్టు చేసి న్యాయ స్థానం ఎదుట హాజరుపరిచారు. కాగా న్యాయస్థానం దాడికి పాల్పడిన ప్రవీణ్‌కు మూడు రోజుల జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించింది.

గోషామహల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. మంగళ్‌హాట్, ధూల్‌పేట్ ప్రాంతాల్లో డ్రైనేజీ, సీసీరోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ..నియోజకవర్గం నలుమూలలా మౌలిక వసతుల రూపకల్పనకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. డ్రైనేజీ ఆధునీకరణ చేపడుతున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లో వీధిదీపాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ కృష్ణ, బీజేపీ నాయకులు బబ్లూ, నరహరి, రాంచందర్ రావు, వివేక్, అశోక్, సురేష్, రామకృష్ణ, నితిన్, బంటి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

దూద్‌బౌలి: పేద ప్రజల సంక్షేమం కోసం తమ పార్టీ నిరంతరం పని చేస్తుందని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ అన్నారు. 155 మందికి మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల కింద లబ్ధిదారులకు గురువారం ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్లు సొహేల్ ఖాద్రీ, ముజఫర్‌లతో పాటు ఘాన్సీబజార్ డివిజన్ మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జి సాహిల్ అక్బర్ పాల్గొన్నారు.

మత్స్యశాఖను ప్రగతి పథంలో నడిపించాలి


మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్


నాంపల్లి: రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం శాంతినగర్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లాస్థాయి మత్స్యశాఖ అధికారుల సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆల అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధికారులతో పలు అంశాలపై చర్చించారు. మత్స్యశాఖను ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మెట్టు సాయి కుమార్ కోరారు. అధికారులందరూ నిబద్ధతతో పనిచేసి మత్స్యకారుల అభివృద్ధి, పురోగతికి తోడ్పాటును ఇవ్వాలని సూచించారు. ఎలాంటి అవినీతి లేకుండా ప్రజలకు సుపరిపాలన అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని, అందుకు అధికారులు సైతం కృషి చేయాలని కోరారు. మత్స్యకారులకు అన్ని విధాలుగా సహకరించాలని ఆదేశించారు.

ప్రమాణ స్వీకారం



జియాగూడ: అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ సంఘ్ కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తుందని అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ సంగ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో కర్ణాటక కోఆర్డినేటర్ సతీష్ బిట్ల అన్నారు. గురువారం అఖిల భారతీయ తెలంగాణ రాష్ట్ర సఫాయి మజ్దూర్ ప్రతినిధులతో ఆయన ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ బిట్ల మాట్లాడుతూ.. చెల్లింపులు వేతనాల చట్టం 1936, 1948, 1972, 2000 ప్రకారం వేతనాలు ఆయా రాష్ట్రాల అమలు చేయడం లేదు ఈ విషయంపై త్వరలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి కార్మికులకు కనీసం 25 నుంచి 30 వేల వేతనాలు ఇవ్వటంతో పాటు అన్ని రకాల బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతామన్నారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్లో జీహెచ్ఎంసీ రాంకీలలో పనిచేస్తున్న స్వీపింగ్ ఇతర రంగాలలో ఉన్న కార్మికుల కోసం మేనేజ్మెంట్‌తో మాట్లాడుతామన్నారు. అధ్యక్షుడు సుభాష్ దుల్గజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరమ్ వీర్ చండాలియా, ఉపాధ్యక్షులు విజయ్ కంగాడ, సత్యనారాయణ, చమన్‌సింగ్ సురేంద్ర, ప్రధాన కార్యదర్శి కిషన్ దుల్గజ్, ప్రకాష్ బిట్ల, కిషన్, విశాల్, రాజేంద్ర వప్పు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా మున్సిపల్ మజ్దూర్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు అండగా ఉండి నిరంతరం వారి సంక్షేమానికి మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను ఏ మాత్రం పరిష్కరించలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలిచిందన్నారు. గురువారం జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులందరికీ 125 గజాల స్థలాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది ఉద్యోగులు ఐఎన్‌టీయూసీ యూనియన్‌లో ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో చేరారు. ఈ కార్యక్రమంలో కె.శివకుమార్, మోజెస్, రామకృష్ణ, కె.రమేష్, జితేందర్‌రెడ్డి, యాదగిరి, విజయ్‌కుమార్ యాదవ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



చార్మినార్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజ్ అన్నారు. పేట్లబురుజులోని పోలీస్ ట్రైనీ విద్యార్థులకు, వారి సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై గురువారం పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని, అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపతే రూ.5000 వరకు జరిమానా, మూడు నెలల జైలు శిక్షను కూడా విధిస్తారన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



సుల్తాన్‌బజార్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో గురువారం జాంబాగ్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కార్పొరేటర్‌గా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అమర్‌సింగ్, రాజు, అనీల్, రవి పాల్గొన్నారు.


పేద విద్యార్థులకు మైరాన్ సంస్థ వితరణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు మైరాన్ హోమ్స్ సంస్థ బ్యాగులు, పుస్తకాలు అందించింది. నాంపల్లిలోని రిసాలా అబ్దుల్లా ప్రభుత్వ పాఠశాలలో 100 మందికి బ్యాగులతో పాటు పుస్తకాలు, స్టేషనరీని సంస్థ ఎండీ యువరాజ్ గురువారం అందజేశారు. ఈ విద్యార్థుల్లో సగానికి పైగా అనాథలే కావడం గమనార్హం. పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని యువరాజ్ హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు నాహీద్ ఫాతిమా పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడిన అధికారులను బర్తరఫ్ చేయాలి

సుల్తాన్‌బజార్: ఏఎన్ఎం నుంచి మెడికల్ ఆఫీసర్ల వరకు అవకతవలకు పాల్పడిన అధికారులను వెంటనే బర్తరఫ్ చేయాలని గురువారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు నర్సింగ్ ఆఫీసర్స్ ఎంపీహెచ్ఎస్ మేల్, ఫిమేల్, ఎంపీహెచ్ఓలు సీహెచ్ఓలు ట్రాన్స్‌ఫర్ల విషయంలో స్పష్టత లేకపోవడంతో వారి గోడు చెప్పుకోవడానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డైరెక్టర్ రవీంద్రనాయక్ అందుబాటులో లేకపోవడంతో ఆఫీసు ముందు ఆందోళన చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆరోగ్య ప్రిన్సిపల్ సెక్రెటరీ స్పందించి వైద్య ఆరోగ్య శాఖ చొరవ కల్పించుకుని సీనియార్టీ ప్రకారం అందరికీ అనుకూలంగా ఉండేలా బదిలీలు చేపట్టాలని కోరారు. ఫిమేల్ ఉమెన్ అస్సియేషన్ ప్రెసిడెంట్ మహల పాత, మరియమ్మ, సాయిరెడ్డి, భూపాల్, హరి శంకర్, భరత్‌తో పాటు ఉద్యోగులు తరలివచ్చి ఆందోళన చేపట్టారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



యాకుత్‌పురా: న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు గురువారం పురానీ హవేలీలోని సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కోర్టు ప్రధాన ద్వారం వరకు ర్యాలీ నిర్వహించారు. కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ.. సిద్దిపేట్ జిల్లా కోర్టుకు చెందిన న్యాయవాది రవికుమార్ బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు పర్చాలంటూ స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని, ఏఎస్సై ఉమారెడ్డి దూషించి సెల్‌ఫోన్ ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డారన్నారు. ఉమారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రవీణారెడ్డి, సంయుక్త కార్యదర్శి బర్క రాజేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జశ్వంత్ కౌర్, న్యాయవాదులు పాల్గొన్నారు.